క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధికి సన్మానం



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి(పెద్ద బ్బాయి)ని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయనను పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పలువురు నాయకులు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు బద్దూ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, సీనియర్ నాయకులు కన్నమాల శామ్యూల్, పెంటి శ్రీనివాసరావు, డీసీసీ మాజీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలను ఈ నెల 14వ తేదీన నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో 18 నీటి సంఘాలున్నాయి. ఈ సంఘాలకు ఈ నెల 11న బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. దీంతో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను కూడా తయారు చేశారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక పాల కేంద్రంలో మంగళవారం పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 104 మంది రైతులకు లీటరుకు రూ.10 చొప్పున రూ. 1,47,900లు బోనస్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి రామనాథం, సంఘ కార్యదర్శి రామకృష్ణ, హెల్పర్ కోటిబాబు, రైతులు పాల్గొన్నారు.

14 లోపు ఆక్రమణలు తొలగించాలి

మున్సిపల్ కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు అయిన కోదాడ రోడ్, విజయవాడ రోడ్, బలుసుపాడు రోడ్, ముక్త్యాల రోడ్ తదితర అన్ని ప్రధాన రోడ్లు, కూడళ్లలో ఆక్రమణలు.. డివైడర్లు, కూడళ్ల వద్ద ఉన్న అనధికార ప్లెక్సీలను ఈనెల 14వ తేదీ లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించని ఎడల జగ్గయ్యపేట ట్రాఫిక్ పోలీసు, పురపాలక సంఘం సిబ్బంది సంయుక్తంగా తొలగిస్తారని పేర్కొన్నారు. దీనిపై వచ్చే కష్ట నష్టాలకు సదరు ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి వస్తుందని వివరించారు.

ఘనంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తు హోమం, అంకురారోహణ వంటి కార్యక్రమాలను ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీ వరప్రసాద్, అర్చకులు చక్రపాణి, గోపాలాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వన్టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణలంకలోని బీజేజేఆర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు కృష్ణా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు పేర్కొన్నారు. ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. రోస్టర్ ప్రకారం బీసీ(ఏ), ఓసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సీఎస్ఈ.ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయం

- పెచ్చులూడుతున్న శ్లాబ్
- భయంభయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



బలుసుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం



చెమ్మతో కనిపిస్తున్న గోడలు



శ్లాబ్ పెచ్చులూడి బయటకు దర్శనమిస్తున్న ఇనుప చువ్వలు

బలుసుపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరి అధ్వానంగా మారింది. భవనం శ్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని పంచాయతీ కార్యాలయ భవనాన్ని 1982లో నిర్మించారు. ఈ పంచాయతీ కార్యాలయంలో 11 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే శ్లాబ్ పెచ్చులూడుతోందని.. చిన్నపాటి వర్షం కురిసినా నీరు కిందకు కారుతుండటంతో రికార్డులు తడిసిపోతున్నాయని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. శ్లాబ్ ఇనుప చువ్వలు బయటకు వచ్చి కూలేందుకు సిద్ధంగా దర్శనమిస్తోందని పేర్కొంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం భారిన పడాల్సి వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సచివాలయ భవన నిర్మాణ పనులను నిలిపివేసింది. దీనిపై సర్పంచ్ ఎడ్లపల్లి సూర్యప్రకాష్ను వివరణ కోరగా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని నిధులు మంజూరు చేస్తే సచివాలయ భవనాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

13న జరిగే రైతుల ధర్నాను విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ పేట నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు పిలుపు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రైతాంగం పడుతున్న ఇబ్బందులపై ఈనెల 13వ తేదీన విజయవాడలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ నేతృత్వంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ పేట నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 90 శాతం పత్తి రైతుల నుంచి దళారుల చేతికి పోయిన తర్వాత ఇక్కడ నాలుగు రోజుల క్రితం పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయడం దారుణమన్నారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ధాన్యం రైతులకు గోనెసంచులు లభించడం లేదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి వాహనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో ధాన్యం రైతులకు మద్దతు ధర లభించక తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం

నందిగామ టౌన్: మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్జైలులో ఖైదీలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం కోసం కోర్టులతో పాటు మానవ హక్కుల కమిషన్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, సబ్జైలు సూపరింటెండెంట్ చదల రామారావు, న్యాయవాదులు షేక్ సైదా, మౌలేశ్వరరావు, ఆజాద్, కృష్ణ, తారాసింగ్, దాదా హుసేన్, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ఫిజియో థెరపీ

ముసునూరు: దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలలకు అందించాల్సిన సౌకర్యాలు, వసతులు, తీసుకోవలసిన జాగ్రత్తలను హెచ్ఎం లోకరాజు వివరించారు. అనంతరం డాక్టర్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

రూ. 11.23 లక్షల జరిమానా



మాట్లాడుతున్న ఈఈ వెంకటేశ్వరరావు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలోని పాలశీతలీకరణ కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకల్లు సెక్షన్ పరిధిలోని 20 గ్రామాల్లో విజయవాడ రూరల్ డివిజన్ విజిలెన్స్ అధికారులు 47 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారని చెప్పారు. ఈ తనిఖీల్లో తొమ్మిది మంది విద్యుత్ మీటర్లు లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని గుర్తించారు. 362 సర్వీసుల్లో అదనపు వాడకాన్ని గుర్తించి రూ. 11,23,350లు జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమ విద్యుత్ వినియోగం నేరమని వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసరావు, కొండలరావు, సుధాకర్, అకౌంట్స్ అధికారులు రవికుమార్, రమేష్బాబు, ఏఈలు, ఎల్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూవివాదాల పరిష్కారమే ధ్యేయం



కంచల గ్రామంలోని రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య, పక్కన తహసీల్దార్ తదితరులు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): భూవివాదాల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సదస్సుల్లో భూములకు సంబంధించిన సమస్యలకు అర్జీలు తీసుకుని సత్వర పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో రైతుల నుంచి 30కి పైగా అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, మండల సర్వేయర్ స్వప్న, ఆర్ఐ హలీమ్, వీఆర్వో ప్రకాష్ పాల్గొన్నారు.

45 రోజుల్లో పరిష్కారం..

నందిగామ టౌన్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను 45 రోజుల్లోగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కంచల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వచ్చేనెల ఎనిమిదవ తేదీ వరకు సదస్సులు జరుగుతాయని తెలిపారు. రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 12 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్బాబు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జయంతి(వీరులపాడు): మండలంలోని జయంతి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హుసేన్ మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, అడంగల్లో మార్పులు, చేర్పులు తదితర సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి దేవి, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గండ్రాయిలో 12 దరఖాస్తులు..

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు 12 దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అనసూయమ్మ, ఆలయ ఈఓ జయప్రకాష్, అటవీ, దేవదాయ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బత్తినపాడు(కంచికచర్ల): మండలంలోని బత్తినపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ రైతులు సమస్యలు పరిష్కరించాలంటూ నాలుగు అర్జీలు దాఖలు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి జంగా సంతోషనరావు, డీటీ మానస, ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.



బత్తినపాడు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ జాహ్నవి

సాగునీటి ఎన్నికలు రహస్య ఓటింగ్ విధానంలో నిర్వహించాలి

వైఎస్సార్ సీపీ పేట నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 14వ తేదీన జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు రహస్య ఓటింగ్ విధానంలో హైకోర్టు తీర్పు ప్రకారం నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికల విధానం అస్తవ్యస్తంగా ఉందని వైఎస్సార్ సీపీ తరఫున ఈ విధానాన్ని తాము వ్యతిరేకించడం జరిగిందన్నారు. నీటి సంఘాల అధ్యక్షుల ఎంపిక విధానం ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా లేదని హైకోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి మండలం, వేములనర్వ గ్రామానికి చెందిన మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, అదే గ్రామానికి చెందిన రైతు కమతం రాములు హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఏకగ్రీవంగా ఎంపిక విధానంలో ఎటువంటి ఇబ్బందులు లేకపోతే ఎంపిక చేసుకోండి, చేతులు ఎత్తే విధానాన్ని ఎవరైనా విభేదిస్తే అక్కడ రహస్య బ్యాలెట్ విధానం ద్వారా ఎన్నికలు నిర్వహించండని హైకోర్టు చాలా స్పష్టంగా తీర్పు ఇచ్చిందన్నారు. కావున హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

చేతులెత్తే పద్ధతి వద్దు

ఏకగ్రీవంగా ఎంపిక చేస్తే తమకు అభ్యంతరం లేదని, అలా కాకుండా చేతులెత్తే పద్ధతి మాకు వద్దు అన్నారు. బహిరంగంగా చేతులు ఎత్తితే రాజకీయ వేధింపులు ఉంటాయని ఆరోపించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో అన్ని డీసీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఎటువంటి పార్టీ విభేదాలు చూడకుండా రైతాంగానికి సేవచేసే అవకాశం ఉన్న వ్యక్తులు ఎన్నికయ్యే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు బద్దూనాయక్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు కన్నమాల శామ్యూల్, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, నాయకులు దొంగల జానకీరామ్, బైరబోయిన బాబు, బొల్లం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడటానికి ప్రాధాన్యతనివ్వాలని చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాసరావు సూచించారు. గ్రామంలోని చిల్లకల్లు టోల్ప్లాజా వద్ద మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్ లేకపోవడంతో తలకు గాయాలై మృతి చెందిన ఘటనలు అనేకమున్నాయని చెప్పారు. కావున ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల: వాహనాలు నడిపే సమయంలో సంబంధిత పత్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఎస్ఐ బోనగిరి రాజు పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, పెట్రోలు బంక్ సెంటర్లలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. రాంగ్రూట్లో వాహనాలు నడపరాదని సూచించారు. అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, త్రిపుల్ రైడింగ్ చేస్తున్న 12మంది వాహనదారులను గుర్తించి రూ. 3,700లు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు పశుపోషణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

మక్కపేట(వత్సవాయి): రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ కూడా పెంచాలని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ బుధవారం వరకు గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులకు పశుపోషణ, వాటి నిర్వాహణపై అవగాహన కల్పించారు. పశుపెంపకం ప్రస్తుతం లాభసాటిగా ఉందన్నారు. మార్కెట్లో పాలు లీటర్ రూ. 80 వరకూ ధర పలుకుతోందని తెలిపారు. పాడిపశువులు వాటికి వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పశువులు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వి. సీతారాంబాబు, ఎస్. జస్వంత్రెడ్డి, పశువైద్యాధికారి కె. శ్రీరాములు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం, నాగేశ్వరరావు, గోళ్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఇబ్బంది లేకుండా సేవలు

డీటీఓ రవి



డీటీఓను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు

విస్సన్నపేట: సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పెన్షన్ సక్రమంగా అందేలా చూస్తున్నామని, పెన్షనర్లను తమ బంధువులుగా భావించి సేవలు అందిస్తున్నామని జిల్లా ట్రెజరీ అధికారి ఎ. రవి అన్నారు. పెన్షనర్ల సమావేశం స్థానిక ట్రెజరీ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నల్లంటి సూరిరాజు పెన్షనర్ల సమస్యలను డీటీఓ దృష్టికి తీసుకువెళ్లారు. పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ల సమయంలో కార్యాలయానికి వెళితే వేలిముద్ర పడలేదనో, వేరే కారణాలతో తిప్పి పంపకుండా పేఫీయల్, ఐరిష్ ద్వారా అయినా నమోదు చేయాలని, బెడ్ రెస్ట్ పెన్షనర్లకు ఇంటి వద్దే నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు డీటీఓను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్చార్జి సబ్ ట్రెజరర్ ఎండీ అర్షాద్ ఉమర్, విశ్రాంత ఉపాధ్యాయులు ధనరాజు, పిరంగి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా హస్త కళాకారుల అభివృద్ధికి కృషి



సెమినార్లో మాట్లాడుతున్న శంకరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): హస్త కళాకారుల్లో మహిళలను ప్రోత్సహించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని కనెక్ట్ టు ఆంధ్ర సీఈఓ కోట్ల శివశంకరరావు పేర్కొన్నారు. భవానీ ఐలాండ్లోని కాన్ఫరెన్స్ హాల్లో డెవలప్మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ సహకారంతో మంగళవారం హస్తకళాకారులకు ఒక రోజు సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శంకరరావు మాట్లాడుతూ.. మహిళలు తాము తయారు చేసిన హస్తకళలను మార్కెటింగ్ చేసుకునేందుకు వ్యాపార మెలకువలను తెలుసుకుని రాణించాలని కోరారు. ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శేఖర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో మహిళల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హస్తకళా సేవా కేంద్రం విజయవాడ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని హస్త కళల అభివృద్ధికి కేంద్ర సహకారంతో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. మహిళలు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.సుధీర్ కుమార్, శ్రీనివాసరావు, సహిత పలువురు ఆర్టిషన్స్ పాల్గొన్నారు.

భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద



విజయవాడకల్చరల్: భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద అని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి వజ్రదాస్ గురూజీ అన్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను మంగళవారం చుట్టుగుంటలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. వజ్రదాస్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ కృష్ణుడు మనకు అందించిన వరం భగవద్గీత అని.. నిత్య పారాయణీయ గ్రంథం కావాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, బొగ్గవరపు రాధాకృష్ణ, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్, మిత్తింటి శారద, వాసవీ క్లబ్ సభ్యుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, పొక్కులూరి సుబ్బారావు, టి.సావిత్రి, ఆర్.సావిత్రి కనకదుర్గ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేతలు: జూనియర్ విభాగం సంపూర్ణ భగవద్గీత పోటీలో దీక్షిత(ప్రథమ), సీనియర్ విభాగంలో పి.లక్ష్మీప్రసన్న(ద్వితీయ), వీవీఎస్ శ్రీధర్ శర్మ (తృతీయ), సీనియర్ విభాగంలో లక్ష్మీప్రసన్న(ప్రథమ) వీవీఎస్ శ్రీధర్ శర్మ(ద్వితీయ), ఎం.దివ్యసాహితీ (తృతీయ)కి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.